నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

మంగళవారం
28 జనవరి
2025
పేజీలు 8

గుంటూరు పల్నాడు






## ఆక్రమిద్దాం...
# అడిగేదెవ్వరు

- నడిరోడ్డు పైనే...వ్యాపారం.
- పోటాపోటీగా ఆక్రమణలు.
- వ్యాపారుల స్వార్థం.. అధికారుల నిర్లక్ష్యం

**సత్తెనపల్లి రూరల్, మేజర్ న్యూస్ :** బడ్డీ కొట్టులు, టీ దుకాణాలు, వ్యాపార సంస్థల బోర్డులు, తోపుడు బండ్లు, బాధ్యత లేని వ్యక్తులు అడ్డదిడ్డంగా నిలిపే వాహనాలు.. అక్రమిద్దాం అడిగేది ఎవరు అన్నట్లుగా పోటా పోటీగా నడిరోడ్డు పైకి చేరిన వ్యాపారాలు.. సహజ సిద్ధమైన అధికారుల నిర్లక్ష్యం..వెరసి పాదాచారులు సైతం నడిచేందుకు కూడా వీలులేని ప్రధాన రహదారులు స్థూలంగా ఇది పట్టణ ప్రధాన రహదారుల దుస్థితి.వ్యాపారపరమైన **మిగతా 3వ పేజీలో**



# బలహీన వర్గాల సంక్షేమమే తెదేపా ధ్యేయం

- **సన్మాన సభలో మాట్లాడిన పలువురు బిసి మంత్రులు ఎమ్మెల్యేలు**
- **బీసీల్లో రాజకీయ చైతన్యం రావాలి**
- **బీసీల అభివృద్ధికి చంద్రబాబు చిత్త శుద్ధితో కృషి**
- **తెదేపాకు అండగా ఉందాం**



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

బలహీన వర్గాలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చేసింది దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుని, ఇదే స్ఫూర్తితో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన నాయుడు అన్నారు. సోమవారం స్థానిక శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బీసీ మంత్రులకు జరిగిన అభినందన సత్కార కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన నాయుడు, రాష్ట్ర వ్యవసాయ, సహకార, పశు సంవర్ధక, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర బీసీ సంక్షేమం , ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం , చేనేత శాఖ మంత్రి ఎస్ సవిత, రాష్ట్ర హౌసింగ్, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తో కలసి పాల్గొన్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహననాయుడు మాట్లాడుతూ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించటం ద్వారానే పంచాయితీ కార్యాలయం మెట్లు కూడ ఎక్కని బీసీలు ఏకంగా పార్లమెంటు సభ్యులై పార్లమెంటు మెట్లు ఎక్కే స్థాయికి ఎదిగారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీసీలకు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించటంతో పాటు వారి సాధికారికతకు వెన్నుదన్నుగా ఉంటున్నారన్నారు. బీసీలకు సంక్షేమంతో పాటు నాణ్యమైన విద్యను అందించటం ద్వారా దేశ స్థాయిలోనే కాకుండా విదేశాల్లో సైతం విద్యను అభ్యసించటంతో, ఉన్నత ఉద్యోగాలు సాధించారన్నారు. భవిష్యత్తు తరం ఎక్కడికో వెళ్లి ఉద్యోగాలు చేసే పరిస్థితి కాకుండా ఇక్కడే ఉపాధి కల్పించే స్థాయికి **మిగతా 3వ పేజీలో**

# ప్రతి ప్రజా ఫిర్యాదును పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ ఆదేశం

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి పిటీషన్ ను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ అధికారులను ఆదేశించారు. సోమవారం కలక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ, సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ కుమారి, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ విజయలక్ష్మీ ప్రజల నుండి 193 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన పిటీషన్లను గడువులోపు పరిష్కరించాలన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి



నాణ్యతగా పరిష్కరించాలన్నారు. వారు పరిష్కరించిన పిటీషన్లు గుణాత్మకంగా, సహేతుకంగా ఉందా, లేదా అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. బియాండ్ ఎస్ఎల్ఏలో వున్న పిటీషన్లు ముందుగా పరిష్కరించాలన్నారు. శాఖల వారీగా పెండింగ్ దరఖాస్తులను జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ సమీక్షించి సూచనలు చేసారు. ఫిర్యాదుల పరిష్కారాన్ని నిర్ణీత గడువు లోపు ఎట్టి పరిస్తితుల్లోను పరిష్కరించాల్సి వుందన్నారు. కోర్టు కేసులకు **మిగతా 3వ పేజీలో**

# వ్యక్తిగత అజెండాలు వదిలిపెట్టాలి

- **ప్రజా సంక్షేమానికే ప్రథమ ప్రాధాన్యం**
- **క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలి**

**గుంటూరు, మేజర్ న్యూస్ :** 'జనసేన పార్టీలో కొత్తగా చేరే వారు క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలి. ముఖ్యంగా వైసీపీ నుంచి వచ్చే వారు వారి వ్యక్తిగత అజెండాలు వదిలిపెట్టి, ప్రజా సంక్షేమానికే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాల'ని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె. నాగబాబు దిశా నిర్దేశం చేశారు. సోమవారం సాయంత్రం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో పీలేరు, పుంగనూరు, చంద్రగిరి, నందిగామ నియోజక వర్గాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు జనసేనలో చేరారు. వీరికి నాగబాబు కండువాలు వేసి సాదరంగా స్వాగతించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆలోచనలు, పార్టీ సిద్ధాంతాలు మనందరికి ముఖ్యం. అందుకు అనుగుణంగా ముందుకు వెళ్దాం. అవసరంలో ఉన్న వారికి సేవ చేయాలని పవన్ కళ్యాణ్ నేర్పించిన




బాటలో నడవాలి. స్వప్రయోజనాల కోసం పార్టీని, రాజకీయాలను ఉపయోగించుకోవద్దు. ప్రభుత్వంలో ఉన్నాం కాబట్టి ఏం చేసినా చెల్లుతుందనే భావన పెట్టుకోవద్దు. జనసేనలో నాతో పాటు ఎంతో మంది నాయకులు పదేళ్లుగా పార్టీలో పని చేస్తున్నారు.పవన్ కళ్యాణ్ అప్పచెప్పిన బాధ్యతలు నిర్వర్తించడం, పార్టీ బలోపేతం కోసం పని చేయడం మినహా స్వప్రయోజనాలను ఎన్నడూ ఆశించలేదు. సామాన్య కార్యకర్త కూడా అత్యున్నతమైన **మిగతా 3వ పేజీలో**

# కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక పురస్కారం అందుకున్న గొడవర్రు సర్పంచ్

**సర్పంచ్ జానకీ దేవిని అభినందించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**



గ్రామపంచాయతీలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు సమర్ధవంతంగా నిర్వహించి, సర్వతో ముఖాభివృద్ధి ఎనలేని కృషి చేసినందుకుగాను గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం గొడవర్రు పంచాయతీ సర్పంచ్ బేరం జానకి దేవి కి కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రత్యేక గౌర పురస్కారాన్ని ఆదివారం అందచేశారు. దేశ స్థాయిలో అత్యంత ప్రతిభ సీలురైన పదిమంది సర్పంచులను ఎంపిక చేయగా అందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి సర్పంచ్ బేరం జానకి దేవికి ఈ పురస్కారం లభించడం విశేషం. ఢిల్లీలో జరిగిన76 గణతంత్ర దినోత్సవ వేడుకలకలకు ముఖ్య అతిథులుగా 29 రాష్ట్రాల నుండి 700 మంది సర్పంచులను కేంద్రం ఆహ్వానించింది. ఏపీ డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ, జానకి దేవికి అభినందనలు తెలియజేశారు. పంచాయితీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని సర్పంచ్ జానకీ తెలిపారు.

## ఘనంగా రాజ్యాంగ సంవిధాన్ దివాస్



**గుంటూరు మేజర్ న్యూస్ :** రాజ్యాంగ సంవిధాన్ దివాస్ కార్యక్రమం తూర్పు అసెంబ్లీ లోని ఆటో నగర్ లో జరిగిన ఈ కార్యక్రమానికి తూర్పు అసెంబ్లీ కో కన్వీనర్ షేక్ రఫీ సభా అధ్యక్షత వహించగా ముఖ్య వక్త గా విచ్చేసిన బీజేపీ రాష్ట్ర పబ్లిసిటీపబ్లిసిటీ, లిటరేచర్ డిపార్ట్మెంట్ ప్రముఖ్ పాలపాటి రవికుమార్ మాట్లాడుతూ రాజ్యాంగం అంటే కనీసం గౌరవం లేని కాంగ్రెస్ ఈ రోజున రాజ్యాంగాన్ని రాహుల్ గాంధీ చేత పట్టుకొని ప్రజలలో విద్వేషాలను రెచ్చగొడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని ఎన్నో సార్లు సవరణలు చేసి ఈ రోజున బిజెపి రాజ్యాంగాన్ని మారుస్తుందని మాయ మాటలు మాట్లాడుతూ ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారని అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రధానిగా ఉన్న మన్మోహన్ సింగ్ ఒక జీవో ని తయారు చేస్తే కనీసం ప్రధానమంత్రి అనే గౌరవం కూడా లేకుండా ఆ జీవో ని చించి వేసి చెత్తబుట్టలో వేసిన ఈ రాహుల్ గాంధీ ఈరోజున కల్లబొల్లి మాటలు చెబుతున్నారని అన్నారు. రాజ్యాంగం గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగం మీద విశ్వాసం గనక ఉంటే ఆ రోజున ఎమర్జెన్సీని తీసుకొచ్చి ప్రజలను భయభ్రాంతులను గురి చేసిందని అటువంటి కాంగ్రెస్ పార్టీ ఈ రోజున రాజ్యాంగం గురించి మాట్లాడటం సిగ్గు చేటు అని అన్నారు. భారతీయ జనతా పార్టీ వాజ్పేయి హయాంలో 6 సంవత్సరాలు నరేంద్ర మోడీ హయాంలో 10 సంవత్సరాలు మొత్తం కలిపి బిజెపి పరిపాలించిన 16 సంవత్సరాలలో కేవలం 22 సార్లు రాజ్యాంగ సవరణలు చేసిందని, ప్రభుత్వం 55 సంవత్సరాలు పరిపాలించిన దాంట్లో 77 సార్లు రాజ్యాంగ సవరణలు చేసిందని అన్నారు. వారు ఏ రోజు కూడా రాజ్యాంగ సవరణలు ప్రజల కోసం కాకుండా వారి ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవడం కోసం వారి పదవుల కోసం చేశారు. కానీ పేద ప్రజల అభ్యున్నతి కోసం మాత్రం ఏ రోజు రాజ్యాంగ సవరణలు చేయలేదని అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ ని కనీస గౌరవం లేకుండా అవమానించిందని కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ ని ప్రత్యక్ష రాజకీయాల్లో ఓడించారు. బిజెపి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ కాంగ్రెస్కి తన పార్టీ రాజ్యాంగం మీదనే విశ్వాసం లేదు అని దేశ రాజ్యాంగాన్ని గౌరవించాలంటే ఒక ప్రజాస్వామ్య స్ఫూర్తి కావాలి అది వారి దగ్గర లేదు. మొట్టమొదటి ప్రధానమంత్రి ఎన్నిక సమయంలో పటేల్ కి 16 ఓట్లు రాగా నెహ్రూకి ఒక్కటంటే ఒక్క ఓటు కూడా పడలేదన్నారు. రాజ్యాంగం పట్ల గాని విశ్వాసం లేని కాంగ్రెస్ పార్టీ నెహ్రూను స్వయంగా ప్రధానమంత్రి పీఠం పైన కూర్చోపెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీదని అటువంటి కాంగ్రెస్ పార్టీ ఈరోజు రాజ్యాంగాన్ని గురించి మాట్లాడటం సిగ్గు చేటు అని అన్నారు. ఈ కార్యక్రమంలోబీజేపీ చరక కుమార్ గౌడ్,రాజ్యాంగ సంవిధాన్ దివాస్ కార్యక్రమ కన్వీనర్ వై . వి . సుబ్బారావు,మేరి సరోజినీ, శివయ్య, పద్మనాభం, కోట బ్రహ్మం, మండల అధ్యక్షులు లక్ష్మణరావు, పవన్ కుమార్, మల్లాల లక్ష్మణ్ గౌడ్, పురుషోత్తం, పలకలూరు శ్రీనివాస్రావు, యారవ శ్రీను, బీజేపీ నాయకులుసురేష్ జైన్,రాజేష్ నాయుడు,కామేపల్లి వెంకటేశ్వర్లు,దేసు సత్యనారాయణ, జితేంద్ర గుప్తా, చంద్రశేఖర్, తానుచింతల అనిల్ లక్ష్మి కుమారి, నరేష్, నాగిరెడ్డి, సుబ్బయ్య, వీరేంద్ర కుమార్, రావుల రాజశేఖర్, అబ్దుల్ రషీద్, సుధాకర్ రావు, కారంశెట్టి రమేష్,మనోజ్,వెంకట షేక్ సాంబశివరావు,రమణ,జయ రామ్, శ్రీనివాస రెడ్డి,నవీన్, సురేష్, రావుఫ్ తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరులో మూడున్నర ఏళ్లలో వంతెన పూర్తి చేస్తాం

- పక్కా ప్రణాళికతో వంతెనలు పూర్తి
- నిర్మాణానికి రూ.41 కోట్లు కేటాయింపు
- పెదపలకలూరు ఎల్ సి. నెం.6కు మంజూరుపై పెమ్మసాని



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

'మొదటి ఏడాదిలోపు వంతెనల మంజూరు, రెండున్నర ఏళ్లలో నిర్మాణాల ఎగ్జిక్యూషన్, మూడున్నర ఏళ్ల లోపు నిర్మాణాలు పూర్తి చేసేలా పక్కా ప్రణాళికతో పని చేస్తున్నాం.' అని గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడారు. పెదపలకలూరు ఎల్సీ నెంబర్ – 6 కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సందర్భంగా ఢిల్లీలోని ఆయన తన కార్యాలయంలో విలేకరులతో సోమవారం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు నగరాభివృద్ధికి ఒక స్పష్టమైన ప్రణాళికలు రచించామన్నారు. గుంటూరు జిల్లా వాసుల మూడు దశాబ్దాల కలగా ఉన్న శంకర్ విలాస్ ఆర్వోబి నిర్మాణంతోపాటు ఔటర్ రింగ్ రోడ్ ఆర్ఓబి నిర్మాణానికి సైతం కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించు కోగలిగామని తెలిపారు. ఇదే క్రమంలో గుంటూరు నల్లపాడు సెక్షన్ లోని పెదపలకలూరు (పుల్లడి గుంట – పేరేచర్ల రోడ్డు) ఎల్ సి నంబర్: 6ను రైల్వే శాఖ ద్వారా మంజూరు చేయించుకున్నామని, ఈ నిర్మాణానికి గాను రూ 41 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని వివరిం చారు. ఇప్పటిదాకా మంజూరైన ఈ మూడు ప్రాజెక్టుల నిర్మాణాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంపై ఎలాంటి ఒత్తిడి ఉండదని, పూర్తిగా కేంద్ర ప్రభుత్వం నిధులతోనే నిర్మాణాలు జరుగుతాయని చెప్పారు. సత్తెనపల్లి, నరసరావు పేట మీదుగా మాచర్ల, హైదారాబాద్ వెళ్లే వారికి ప్రయోజనాలకు ఉపయోగపడతాయి. వ్యవసాయోత్పత్తులకు, రైతాంగానికి, పలు ప్రాంతాల ప్రజల రాకపోకలకు ఈ ఆర్ఓబి నిర్మాణం కచ్చితంగా ఉపయోగపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గుంటూరు పార్లమెంట్, రాష్ట్ర ప్రజలకు సేవ చేసేందుకు తనకు అవకాశమిచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్, సోమన్న లకు ఈ సందర్భంగా పెమ్మసాని ధన్యవాదాలు తెలియజేశారు.

# సకల జనుల అద్భుతాల వేదికగా.. మహోత్సవాలు

**బైబిల్ మిషన్ అధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె. శామ్యేల్ కిరణ్**

**పెదకాకాని, మేజర్ న్యూస్ :** సకల జనులకు అద్భుతాల వేదికగా బైబిల్ మిషన్ మహోత్సవాలు నిలిచాయని బైబిల్ మిషన్ అధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ .జె. శామ్యేల్ కిరణ్ అన్నారు.ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట మహోత్సవాల ప్రాంగణంలో వేయబడిన పందిరిలో ఫాదర్ ఎం దేవదాసు అయ్యకు దేవుడు బయలపరిచిన 87వ, బైబిల్ మిషన్ మహోత్సవాలు సోమవారం రెండో రోజుకు చేరుకున్నాయి.ఈ సందర్భంగా భక్తులను ప్రోత్సాహపరిచే విధంగా దైవ సందేశాలు కొనసాగాయి. ప్రధానంగా మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ .జె. శామ్యేల్ కిరణ్ కొనసాగించిన దైవ సందేశం భక్తులలో విశ్వాసాన్ని నింపింది. ఈ సందర్భంగా యేసు క్రీస్తు చేసిన అద్భుతములను ఉదాహరించారు.ఆనాటి యెరికో పట్టణములో ఉన్న అంధత్వం కలిగిన వ్యక్తి తనకు చూపు ప్రసాదించమని విశ్వాసంతో ప్రార్థించగా, అతని జీవితంలో ఏసుక్రీస్తు ప్రభువు అద్భుత కార్యములు చేసినట్లు వివరించారు. దేవుని గురించి వినుట, విశ్వసించుట ద్వారా మాత్రమే అతడు కంటి చూపు



పొందినట్లు చెప్పారు. తన పట్ల దేవుడు చూపిన కృపను వ్యర్థపరచకుండా ఆయనను మహిమపరస్తూ ఆయనను వెంబడించాడు. దానిని బట్టి అనేకులు దేవుని స్తుతించారు. ప్రభువును స్తుతించాడు. అనేకులు స్తుతించడానికి కారకుడయ్యాడు అని ప్రధాన అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భక్తులకు వివరించారు. నేటి క్రైస్తవ్యం ఆధ్యాత్మిక అంధకారంలో కొట్టుమిట్టాడుతూ, కన్నులుండి ఆత్మీయ అంధులుగా జీవిస్తున్న మన జీవితాలు వెలుగుమయం కావాలంటే దేవుని వాక్యం వినడం, విశ్వసించటం, విధేయత కలిగి జీవించటం వంటి ఉన్నత లక్ష్యాలను కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా జీవ వాక్యంతో లోకమందు జ్యోతుల వలె ప్రతి ఒక్కరు ప్రకాశించాలని కోరారు. బైబిల్ మిషన్ జాయింట్ సెక్రటరీ, రెవరెండ్ డి సుధాకర్, రెవరెండ్ కే ఏసురత్నం, రెవరెండ్ ఎన్. సత్యంబాబు, రెవరెండ్ మహిమాకర్షణ కుమార్, రెవరెండ్ సిహెచ్ షాలేము శరత్ తదితరులు దైవ సందేశాలు అందించారు. బైబిల్ మిషన్ అధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ .జె. శామ్యేల్ కిరణ్ , వైస్ ప్రెసిడెంట్ రేవరెండ్ పి. జాన్ దేవదాసు , సెక్రటరీ రేవరెండ్ కె. ప్రశాంత్ కుమార్ , జాయింట్ సెక్రటరీలు రేవరెండ్ డి. సుధాకర్ ,రేవరెండ్ జె. ఆగమన రావు , రేవరెండ్ ఎం. సజీవరావు,గవర్నింగ్ బాడీ సభ్యులు సారధ్యంలో వివిధ కమిటీల కృషితో ఈ ఏడాది ఆధ్యాత్మిక క్రైస్తవ ఉత్సవాలు ప్రతిష్టాత్మకంగా రెండవ కొనసాగాయి.బైబిల్ మిషన్ మహోత్సవాలకు మంగళవారం మాజీ మంత్రివర్యులు, వేమూరు నియోజకవర్గ శాసనసభ్యులు ఆనంద్ బాబు,రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల ఇమ్మానుయేలు తదితరులు హాజరయ్యారు. వారికి నిర్వాహకులు ఆశీర్వాదాలు పలికారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకల్లో వర్ణమాల బావి శకటం ప్రదర్శన

**పెదకాకాని మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని అనమర్లపూడి ఎం పి యు పి స్కూల్ నందు పనిచేస్తున్న ఆర్. నిర్మల కుమారి,సర్వేపల్లి విద్యార్థి మిత్ర యూనిఫామ్ ను చిన్న చిన్న బొమ్మలను స్వయంగా తయారు చేసి 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో గుంటూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నందు విద్యా శకటం ప్రదర్శించారు. విద్యార్థులకు సులభంగా అర్థం చేసుకునేందుకు ఆసక్తిని పెంపొందించుకోవడం కోసం వర్ణమాల బావిని తయారుచేసి ఈ శకటంలో ప్రదర్శించారు.



# " రాజధాని నిర్మాణం - రాష్ట్రాభివృద్ధి జాతా"ను జయప్రదం చేయండి

**గుంటూరు మేజర్ న్యూస్ :** సిపిఐ(ఎం) 27వ రాష్ట్ర మహాసభలు 2025 ఫిబ్రవరి 1,2,3 తేదీలలో నెల్లూరు నగరంలో జరగనున్నాయి. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా తాడేపల్లి నుండి నెల్లూరు వరకు జనవరి 30,31 తేదీలలో జరిగే "రాజధాని నిర్మాణం – రాష్ట్రాభివృద్ధి జాతా"ను జయప్రదం చేయాలని సిపియం జిల్లా కార్యదర్శి వై.నేతాజి కోరారు. నెల్లూరులో జరిగే రాష్ట్ర మహాసభ బహిరంగ సభ పోస్టర్ను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వై.నేతాజీ మాట్లాడుతూ రాష్ట్ర మహాసభల సందర్భంగా జరిగే జాతాను సిపియం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్.బాబురావు ప్రారంభిస్తారని, పార్టీ జిల్లా కార్యదర్శి వై.నేతాజి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎమ్.రవి, బి.వెంకటేశ్వర్లు జాతాకు నాయకత్వం వహిస్తారని, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు,




ఎన్.భావన్నారాయణ, ఈమని అప్పారావు, కె.నళినీకాంత్లు పాల్గొంటారన్నారు. జాతా జనవరి 30తేదీన ఉదయం 9గంటలకు గత రాష్ట్ర మహాసభలు జరిగిన తాడేపల్లిలో ప్రారంభమై మంగళగిరి, తుళ్ళూరు, తాడికొండ, పెదకాకాని మీదగా సాయంత్రానిక గుంటూరు చేరుకుంటుం దన్నారు. జనవరి 31వ తేదీన గుంటూరు నుండి బయలుదేరి ఉదయం 9గంటలకు నారాకోడూరు, తెనాలి, పొన్నూరు, బాపట్ల, చీరాల, ఒంగోలు మీదగా రాత్రికి నెల్లూరు చేరుకుంటుందన్నారు. గత ప్రభుత్వహయాంలో రాష్ట్ర రాజధాని ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. జాతా సందర్భంగా జరిగే సభల్లో ప్రజానీకం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర మహాసభల సందర్భంగా నెల్లూరులో ఫిబ్రవరి 3వతేదీన ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతాయని, అఖిల భారత నాయకులు బృందాకరత్, ఎమ్.ఎ.బేబి, బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఎమ్.ఎ గఫూర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవి తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని, ఈ సభల్లో వేలాది మంది ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిపియం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు, ఎమ్.రవి, ఎన్.భావన్నారయణ, ఈమని అప్పారావు, కె.నళీనికాంత్, బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# బలహీన వర్గాల సంక్షేమమే తెదేపా ధ్యేయం





(మొదటి పేజీ తరువాయి)

ఎదిగేలా ముఖ్యమంత్రి చంద్రబాబు పునాదులు వేస్తున్నారన్నారు. వెనుకబడిన తరగతుల వారందరూ ఐకమత్యంగా ఉంటేనే వారు అనుకున్న లక్ష్యాలను సాధించటం సాధ్యం అవుతుందన్నారు. వీరు పనిచేయకపోతే దేశమే ఆగిపోతుందని, వారికి ఉన్న నైపుణ్యాలతో పరిశ్రమల ఏర్పాటు చేసేలా భావితరాల వారిని ప్రోత్సహించాలన్నారు. వెనుకబడిన తరగతుల వారి సమస్యలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అవి పరిష్కరించేలా నిరంతరం కషి చేస్తామన్నారు. రాష్ట్ర హౌసింగ్ , సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి, సంపద పెరిగితేనే బడుగు, బలహీన వర్గాలకు ఉపాధి అవకాశాలు పెరిగి వారు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తారన్న లక్ష్యంతోనే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకువచ్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. గత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సంక్షేమం పేరుతో రాష్ట్ర వనరులను దోచుకున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటంతో పాటు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించటానికి వారికి స్కిల్ డెవలప్మేంట్ సెంటర్లు ద్వారా నైపుణ్యం శిక్షణ అందిస్తున్నారన్నారు. బలహీన వర్గాల వారు ఆర్థికంగా బలోపేతం అవటం ద్వారానే సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. బలహీనవర్గాల ప్రజలు స్వయం ఉపాధి పథకాలు, వ్యాపార నిర్వహణకు ఆర్థిక సంస్థల నుంచి రుణాలు సాధించటానికి ప్రయత్నించాలన్నారు. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయటం తోపాటు ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలని చంద్రబాబు నాయుడు పాలన చేస్తున్నారు. ప్రతి కుటుంబాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసే ప్రయత్నం చేయాలన్న ఆలోచన ధోరణి ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోనే బీసీల భవిష్యత్తు పదిలంగా ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యవసాయ, సహకార , పశు సంవర్ధక, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ పెట్టారన్నారు. అదే స్ఫూర్తితో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీసీలలోను 130 కులాలను అన్ని రంగాల్లో సామాజికంగా ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. బీసీ కులాల జనభా దామాషా ప్రకారం ఆర్థిక అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీకి బీసీ లే అండగా ఉన్నారనే కక్షతోనే గత ప్రభుత్వ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి బీసీ కార్పోరేషన్ ను నిర్వీర్యం చేయటంతో పాటు, బీసీ కులాల వారిని ఉక్కుపాదంతో అణచివేశారన్నారు. 2014-19 లో ప్రభుత్వం మంజూరు చేసిన బీసీ హాస్టల్స్, బీసీ భవన్ ల నిర్మాణాలను నిలిపివేశారన్నారు. అటువంటి పరిస్థితులలో బలహీన వర్గాలు తలెత్తుకు తిరిగేందుకు మరలా తెలుగు దేశం పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీసీలకు సముచిత స్థానం ఇచ్చి బీసీ వర్గాలకు చెందిన వారికి కీలకమైన మంత్రి పదవులు ఇచ్చారన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఈవోగా , రాష్ట్ర డీజీపీగా ,రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ని సైతం బీసీ వర్గాల వారిని నియమించిన ఘనత చంద్రబాబు కు చెందుతుందన్నారు. రాష్ట్రంలో బీసీలకు ఉద్యోగ, ఉపాధి, సామాజిక, రాజకీయాలలో సమాన అవకాశాలు కల్పించేలా పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామన్నారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ , సెర్ఫ్ , ఎన్ ఆర్ ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీల అభ్యున్నతికి బడ్జెట్లో రూ.39,000 కోట్లు కేటాయించిం దన్నారు. గత ప్రభుత్వం బీసీల సంక్షేమ కార్యక్రమాలకు నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేసిందని, ఆదరణ పథకం క్రింద పనిముట్లు అందించలేదని, బీసీ హాస్టల్స్ , సబ్ ప్లాన్ నిధులు నిలిపివేసిందన్నారు. చట్టసభల్లో బీసీలకు ఉన్న రిజర్వేషన్లు తగ్గించిందని, తిరిగి బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు తెచ్చే దిశగా ఈ కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం , చేనేత శాఖ మంత్రి ఎస్ సవిత మాట్లాడుతూ బీసీలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ పూర్తి అండగా ఉంటుందన్నారు. పార్టీ అధికారంలో లేని సమయంలో అచ్చెన్నాయుడు పార్టీకి అండగా ఉండి నడిపించారని, వైసిపి ప్రభుత్వం తనపై 24 కేసులు పెడితే..నీ వెనుక నేనున్నానని అచ్చెన్నాయుడు ధైర్యం చెప్పారన్నారు. బీసీ కార్పోరేషన్లను నిర్వీర్యం చేసిన బీసీల ద్రోహి జగన్ మోహన్ రెడ్డి అన్నారు. బీసీలలో ప్రతి కుటుంబం నుంచి ఒకరిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దటానికి ప్రభుత్వం అవసరమైన అన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. మెగా డీఎస్సీ కి 26 జిల్లాలలో బీసీ స్టడీ సర్కిల్ ద్వారా శిక్షణ అందిస్తున్నామని, బీసీ హాస్టల్స్, బీసీ భవనాలు నిర్మాణానికి ముఖ్యమంత్రి ఆదేశాలతో చర్యలు తీసుకుంటున్నామన్నారు. బీసీల రాజకీయ, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. శాసనమండలి సభ్యులు దువ్వారపు రామారావు, శాసనసభ్యులు గళ్ళా మాధవి, మహ్మద్ నసీర్ అహ్మద్, బూర్ల సీతారామాంజనేయులు, తెనాలి శ్రావణ కుమార్, ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనగళ్ళ సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ అధికారంలోకి రాక మునుపు బీసీలకు ఎటువంటి ఆదరణ లేదని ఎన్టీఆర్ అధికారంలోకి రాగానే బీసీలకు పెద్దపీట వేసి రాజకీయంగా ఎదిగేందుకు అవకాశాలు కల్పించారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీలను సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేసేలా అవసరమైన పథకాలు అమలు చేస్తున్నారన్నారు. బీసీ కార్పోరేషన్ ఎర్పాటు చేసి బీసీలు ఆర్థికంగా నిలదొక్కుకునేందు అవకాశం కల్పించారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీలను విస్మరించారన్నారు. బీసీలు అంతా సమైక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధించవచ్చన్నారు. రాజకీయాలు ఒక కుటుంబానికే కాదు దామాషా ప్రకారం అందరికీ చెందాలని ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించారన్నారు. జనాభా లో సగం ఉన్న బీసీలను చంద్రబాబు నాయుడు ముందుకు నడిపిస్తున్నారు. సూపర్ సిక్స్ పథకాలు ద్వారా రాష్ట్ర ప్రజలకు ఈ కూటమి ప్రభుత్వం మేలు చేస్తుందన్నారు. అనంతరం బీసీ సాధికారిక కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సభలో కేంద్ర పౌర విమాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన నాయుడు, రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత, రాష్ట్ర హౌసింగ్, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, శాసనమండలి సభ్యులు దువ్వారపు రామారావు, శాసనసభ్యులు గళ్ళా మాధవి, మహ్మద్ నసీర్ అహ్మద్, బూర్ల సీతారామాంజనేయులు, తెనాలి శ్రావణ కుమార్ ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనగళ్ళ సత్యన్నారాయణ లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐడీసీ ఛైర్మన్ దేగల ప్రభాకర్, మాజీ డిప్యూటీ మేయరు తాడిశెట్టి మురళీమోహన్ కార్యక్రమ నిర్వహణ కమిటీ కన్వీనర్ బండపల్లి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు , కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత అజెండాలు వదిలిపెట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

స్థానానికి ఎదిగే అవకాశం జనసేనలో ఉంది" అన్నారు. శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ "దేవుడి అభిషేకానికి కొందరు కాలువల నుంచి, ఇంకొందరు నదుల నుంచీ జలాలు తీసుకువెళ్తారు. ఏ నీరు తీసుకువెళ్లినా దేవుడికి అభిషేకించిన అనంతరం అది తీర్థంగా మారుతుంది. ఇతర పార్టీల నుంచి జనసేన పార్టీలో చేరే కార్యకర్తలు కూడా మన సిద్ధాంతాలను అనుసరించి ప్రజలకు చేరువవుతారు. ప్రజల కోసం నిలిచిన సామాన్యులకి ఇక్కడ మంచి అవకాశాలు లభిస్తాయి. జనసేన పార్టీ బలోపేతం కోసం పని చేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు, గౌరవం ఉంటుందనడానికి నిదర్శనం నేనే. పాత్రికేయుడిగా ఉన్న నేను పార్టీలోకి వచ్చాను. ఇప్పుడు లెజిస్లేటివ్ కౌన్సిల్లో విప్ స్థాయికి రావడానికి పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ , పార్టీ నేతలు అండగా ఉంటూ ప్రోత్సాహమే కారణం" అన్నారు. జనపార్టీ అధికార ప్రతినిధి, టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి , ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను , పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**నాగబాబు సమక్షంలో జనసేనలో భారీ చేరికలు..**

చిత్తూరు జిల్లా పీలేరు, పుంగనూరు, చంద్రగిరి, ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజక వర్గాలకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, సర్పంచ్ లు, మాజీ సర్పంచ్ లు, వివిధ కార్పొరేషన్, మార్కెట్ యార్డు, విద్యాలయ, దేవాలయ కమిటీలకు చెందిన ఛైర్మన్ లు, డైరెక్టర్లు, మాజీ జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, వార్డు మెంబర్, వైసీపీ జిల్లాస్థాయి నాయకులు, యువజన విభాగం నాయకులు, వ్యాపారస్తులు జనసేన పార్టీలో చేరారు. పీలేరు ఇంఛార్జి బి.దినేష్, నందిగామ. పుంగనూరు, చంద్రగిరి పి.ఓ.సి.లు శ్రీమతి తంబళ్లపల్లి రమాదేవి, సిరివేలు గంగాధర్, దేవర మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమిద్దాం.. అడిగేదెవ్వరు

(మొదటి పేజీ తరువాయి)

పోటీతో ఆక్రమణలు ఒకరినొకరు పోటీతత్వం వల్ల మా దుకాణమే కనిపించాలని వ్యాపారస్తులు భావిస్తూ ఎవరికి వారు ముందుకు జరుగుతూ ప్రధాన రహదారిపైకి చేరుకున్నారు. దింతో పట్టణంలోని ప్రధాన రహదారులపై వెళ్లే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుకున్నారు. నిత్యం అధికారులు, రాజకీయ నాయకులు రాకపోకలు సాగించే మార్గాలను సైతం అధికారులు పట్టించుకోక పోవటంతో స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గుంటూరు - పిడుగురాళ్ల రహదారి పై.రోజు రోజుకి పట్టణ జనాభా పెరగటం... దీనికి తోడు వాహనాల సంఖ్య కూడా పెరుగుతున్నాయి. అయితే ఆ మేరకు రహదారుల విస్తరణ కూడా జరగపోవడంతో పట్టణంలో ప్రధానంగా ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారింది. దీనికితోడు అగ్నికి ఆజ్యం పోసినట్లుగా కొంతమంది వ్యాపారుల ఆక్రమణలు వలన రహదారులు, అంతర్గత రోడ్లు కుచించుకు పోవటంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధానంగా ఆర్.సిఎం చర్చి నుంచి నరసరావుపేట రోడ్డు చెక్కపోస్టు వరకు గుంటూరు హైదరాబాద్ రహదారికి ఇరువైపులా ఈ సమస్య నెలకొంది. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న గోశాల వ్యాపార దుకాణ దారులైతే అయితే మరీ ప్రధాన రహదారిపైకిలి వచ్చేశారు. దింతో దుకాణంలో కొనుగోలు చేసేందుకు వచ్చే వారు ప్రధాన రహదారిపైన నిలబడాల్సిన పరిస్థితి తలెత్తటంతో నిత్యం రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో ప్రమాదాలకు నిలయంగా మారింది. అంతర్గత రోడ్ల పైన కూడా ఇదే సమస్య పట్టణంలో రైల్వే స్టేషన్ రోడ్డు, వెంకటరత్నం ఆసుపత్రి రోడ్డు, ఎల్ఐసీ రోడ్డు, లక్ష్మీ థియేటర్, తాలూకా లోకో ఆక్రమణలు ప్రైవేటు వాహనాల అడ్డగోలు నిలుపుదలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. బాలికల ఉన్నత పాఠశాల వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో బాలికలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణ పోలీసులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో ట్రాఫిక్ సమస్యకు ప్రణాళిక బద్ధమైన పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రతి ప్రజా ఫిర్యాదును పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి సమీక్షిస్తూ గౌరవ కోర్టులకు ఎప్పటికప్పుడు కౌంటర్లు దాఖలు పరచాలన్నారు. ఎలాంటి పరిస్థితుల్లో కూడా కేసు కంటెమ్ట్ వరకు వెళ్ళకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ వారు దివ్యాంగుల వద్దకే వెళ్ళి వారి నుండి ఫిర్యాదులను అందుకొని వాటిని పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని వారికి భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో సిపిఓ శేషశ్రీ, డియం అండ్ హెచ్ఓ డా. విజయలక్ష్మీ, డిఎస్ఓ కోమలి పద్మ, డిపిఓ బి.వి.నాగ సాయి కుమార్, డిసిఓ వీరాచారి, జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు, వికలాంగుల సంక్షేమ శాఖ ఏ డి సువార్త, ఎల్ డి యం మహిపాల్ రెడ్డి, ఆరోగ్య శ్రీ జిల్లా కో ఆర్డినేటర్ విజయ్ ప్రకాశ్, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు



గుంటూరు మేజర్ న్యూస్ : గుంటూరు చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా నగరాలు చిల్డ్రన్స్ క్లబ్ ఏర్పాటు చేయడం జరిగింది. ముందుగా రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు నివాళులర్పించడం జరిగింది. క్లబ్ ను ఉద్దేశించి రాష్ట్ర నాయకులు ఎన్.బి మాట్లాడుతూ పిల్లలు హాయిగా ఎగరాలి, మాట్లాడాలి, ప్రకృతితో మమేకమై ఎదగాలనీ, పిల్లల్లో కొన్ని సూక్ష్మ ఆలోచనలు ఉంటాయి వాటిని మనం బయటకు తీసుకొచ్చి ప్రోత్సహించాలి, అదేవిధంగా పిల్లలకు శాస్త్రజ్ఞుల గురించి జాతీయ నాయకుల గురించి తెలుగు రాయడం చదవడం వీటన్నిటిని మనం చెప్పాలన్నారు. జిల్లా కో-కన్వీనర్ పద్మ మాట్లాడుతూ పిల్లలకు చిన్నప్పటినుండి మంచి విషయాలు చెప్పటం వలన వారు ఎదిగే కొద్దీ మంచి ప్రవర్తనతో తోటివారి పట్ల మహిళల పట్ల ఆడపిల్లల పట్ల బాధ్యతగా ఉంటారు, అలాగే పిల్లలకు ఏది ఇష్టము దానిని మనం ప్రోత్సహిస్తే వారు ఆ రంగంలో మంచిగా ఎదగడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ క్లబ్బుకు అధ్యక్ష కార్యదర్శులు విజయ్, నరసింహ, బాలు, నికిత అదేవిధంగా పేరెంట్స్ కమిటీగా శ్రీలక్ష్మి, సుమలత, సుభాని, రాజు ఎన్నికయ్యారు, కమిటీ సభ్యులుగా బాలబాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నేడు జిల్లా సమీక్ష కమిటీ సమావేశం

### హాజరుకానున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్

**గుంటూరు, మేజర్ న్యూస్ :** జిల్లా ఇన్ చార్జ్ మంత్రి, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన ఈ నెల 28 వ తేది (మంగళవారం) ఉదయం 10.30 గంటలకు కలక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా సమీక్షా కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి నేడొక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశంలో అజెండా అంశాలైన వ్యవసాయం మరియు అనుబంధ రంగాలు, పరిశ్రమలు మరియు స్కిల్, గుంటూరు నగరపాలక సంస్థ, యంటీయంసీ, హౌసింగ్, డిస్ట్రిక్ట్ వాటర్ మేనేజ్మెంట్ ఏజెన్సీ, మెడికల్ అండ్ హెల్త్, విమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖలపై సమీక్షించడం జరుగుతుంది. గుంటూరు జిల్లాకు చెందిన మంత్రి, ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశానికి హాజరు కానున్నారు.

# 24 గంటల్లో, పిజిఆర్ఎస్ ఆర్జీలు నిర్దేశిత గడువులోనే పరిష్కారం

**గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు**

**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ :**

గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే దయల్ యువర్ కమిషనర్ ఫిర్యాదులను 24 గంటల్లో, పిజిఆర్ఎస్ ఆర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్ లో దయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పిజిఆర్ఎస్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కమిషనర్ తొలుత దయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుండి అందిన 25 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ఆర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్ కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కు 48 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 13, ఇంజినీరింగ్ విభాగం 16, రెవెన్యూ



విభాగం 9, ప్రజారోగ్య విభాగం 7, అకౌంట్స్ విభాగం 1, ఉపా సెల్ విభాగానికి సంబంధించి 1 ఫిర్యాదు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, ఎస్.ఈ. నాగమల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, డిసిపి సూరజ్, సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, ఉపా సెల్ పిఓ రామారావు, మేనేజర్ బాలాజీ బాష తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తి విక్రయాల కేంద్రం




**మాచవరం, మేజర్ న్యూస్**

పిడుగురాళ్ల డివిజన్ నందు మాచవరం మండలంలో కొత్త గణేష్ పాడు యూనిట్ నందు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తి విక్రయాల కేంద్రం స్టాల్ సోమవారం ఏర్పాటు చేయడం జరిగినది. అందులోని సిబ్బంది వారి సొంతంగా వారు 20 సెంట్లు తీసుకొని అందులో ఏటీఎం మోడల్ అని వేసి అందులో ఐదు రకాల జాతులకు సంబంధించి వారు పండించి ఆ ఉత్పత్తులను నేరుగా రైతుల దగ్గర తీసుకువచ్చి వారికి అందించే ప్రక్రియ కొరకు ఏర్పాటు చేయడం జరిగింది. ముఖ్యంగా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను తినడం వల్ల ఆరోగ్యంగా ఉండటమే కాకుండా రానున్న రోజుల్లో మరింత పోషకాలు సమృద్ధిగా లభించే ఆహార ఉత్పత్తులు తినడం వల్ల ఆరోగ్యంగా ఉండడమే కాకుండా విషపూరిత రసాయనాల ద్వారా పండిన ఆహారాలకు దూరంగా ఉండవచ్చు అని చెప్పడం జరిగింది. ప్రతి సోమవారం మాచవరం మండలంలో స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఇన్చార్జి సర్పంచ్ పల్లానరేంద్రబాబు గ్రామ పెద్దలు చల్లగుల్ల భిక్షమయ్య కొత్త గణేష్ పాడు సర్పంచి 1పొందూరి నరసింహ రావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కొత్త గణేష్ పాడు యూనిట్ ఇన్చార్జి (ఎల్ 2 ) సునీల్ కుమార్. పిడుగురాళ్ల డివిజన్ (ఎం.టి) బాజీ బాబు, జి ఉషారాణి బి శ్రీను నాయక్ జ్యోతి, రైతులు పాల్గొనడం జరిగింది.

# ప్రైవేట్, కార్పొరేట్ విద్యసంస్థల ఫీజుల దోపిడిని అరికట్టాలి

**ఏ ఐ ఎస్ ఎఫ్, ఎస్ ఎఫ్ ఐ డిమాండ్**




**గుంటూరు మేజర్ న్యూస్ :**

రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యసంస్థల ఫీజుల దోపిడిలను అరికట్టాలని గుంటూరు జిల్లా లో వామ పక్ష విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశారు .వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ నారాయణ, శ్రీ చైతన్య, విద్యాసంస్థల వారి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ విద్య సంస్థల వారు అధిక సంఖ్యలో ఫీజుల దోపిడీ చేస్తూ విద్యార్థుల ప్రాణాలు పోతున్న మాకు సంబంధం లేదు మాకు ఫీజులు మాత్రమే ముఖ్యం అని వ్యవహరిస్తున్నారన్నారు. ఫీజులు చెల్లించక పోతే కళాశాలలో హాల్ టికెట్స్ ఇవ్వము అని విద్యార్థులను బెదిరించి వారిని మానసికంగా హింసించడం వలన అనంతపురం జిల్లా లోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న చరణ్ అనే విద్యార్థి ఇటీవల భవనం పైకి ఎక్కి దూకి మరణించడం జరిగిందని, మరణానికి కారణమైన నారాయణ విద్యాసంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఫీజులు వసూలు చేసే దాని మీద ఉన్న శ్రద్ధ విద్యార్థుల ప్రాణాలు కాపాడడంలో కార్పొరేట్ విద్యా సంస్థలకు లేదని మండిపడ్డారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల దోపిడీని అరికట్టాలని గుంటూరు జిల్లా కలెక్టర్ నాగ లక్ష్మి ని మెమోరాండం అందచేశారు ఈ కార్యక్రమంలో వామ పక్ష విద్యార్థి సంఘాలు ఏ ఐ ఎస్ ఎఫ్ , ఎస్ ఎఫ్ ఐ తదితర విద్యార్థులు పాల్గొన్నారు

# జీవనోపాధి కోల్పోయిన పేదలకు సహాయం



**మంగళగిరి, మేజర్ న్యూస్:**

వరద సమయంలో జీవనోపాధి కోల్పోయిన మంగళగిరి పట్టణంలోని పేదలకు ఆదివారం యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్, పారేపల్లి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తోపుడుబండ్లు, కుట్టు మిషన్లు, చిరు వ్యాపారాలకు సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమా నికి యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ఇన్చార్జ్ శ్రీరాములు, పారేపల్లి ఫౌండేషన్ అధినేత పారేపల్లి రామకృష్ణ, విజయలక్ష్మి, పారేపల్లి మహేష్, పారేపల్లి దుర్గాప్రసాద్, ఉడత శ్రీనివాస్, ప్రసాద్, కాగితాల స్వాతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 17 నామినేషన్లు పోటీకి అర్హత కలిగి ఉన్నాయి

**- స్టాండింగ్ కమిటీ ఎన్నికల అధికారి చల్లా ఓబులేసు**

**నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్**

గుంటూరు నగరపాలక సంస్థ స్థాయి సంఘం (స్టాండింగ్ కమిటీ) ఎన్నికకు దాఖలు జరిగిన 17 నామినేషన్లు వ్యాలిడ్ అయ్యాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు చే ఎన్నికల అధికారిగా నియమింపబడిన నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, స్టాండింగ్ కమిటి ఎన్నికల అధికారి చల్లా ఓబులేసు సోమవారం తెలి పారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ నగర



పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు ఈ నెల 16న నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని, ఫిబ్రవరి 3న ఎన్నిక జరుగుతుందని తెలిపారు. 17 మంది నామినేషన్లు దాఖలు చేయగా, సోమవారం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు అభ్యర్థుల సమక్షంలో నామినేషన్లను స్క్రూట్ని చేశామని తెలిపారు. స్క్రూట్ని అనంతరం 17 నామినేషన్లు పోటీకి అర్హత కల్గినాయని తెలిపారు. అలాగే ఈ నెల 27వ తేదీ నుండి 30వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందని, అదే రోజు 3 గంటల తర్వాత పోటీల్లో ఉండే తుది అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఫిబ్రవరి 3వ తేదీ ఎన్నిక జరుగుతుందని తెలిపారు.

# అభివృద్ధి పనులలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు : నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ :**

గుంటూరు నగరంలో నగరపాలక సంస్థ చేపట్టే అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ చేయాలని, పనులను ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టితో పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ రెడ్డిపాలెం, నగరాలు, గోరంట్ల, ముత్యాలరెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి పనులను పరిశీలించి, ఇంజినీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు జీఎంసి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. డ్రైన్లు, రోడ్ల నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఆ దిశగా ఇంజినీరింగ్



అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపాలు గమనిస్తే సంబంధిత కాంట్రాక్టర్ ని బ్లాక్ లిస్టులో పెట్టడంతోపాటు, పర్యవేక్షణ అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం ఆర్టీఓ ఆఫీస్ వద్ద గల అన్న క్యాంటీన్ ని పరిశీలించి, క్యాంటీన్లలో త్రాగునీరు, మౌలిక వసతులు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆహార పదార్థాల నాణ్యత, మౌలిక వసతులపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల రద్దీకి తగిన విధంగా ప్రతిరోజు ఆహార ఇండెంట్ పెంచుకోవడం చేయాలని సిబ్బందికి సూచించారు. అన్నక్యాంటీన్ నిర్వహణ, ఆహార పదార్థాల నాణ్యత ఇతర అంశాలపై ప్రజలు క్యాంటీన్లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాలను, సూచనలను తెలుపవచ్చన్నారు. పర్యటనలో డిఈఈలు రమేష్ బాబు, శ్రీనివాసరావు, ఆర్ఓ రవి కిరణ్ రెడ్డి, ఎస్ఎస్ సోమశేఖర్, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మార్వాడి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో విద్యాసదస్సు



**గుంటూరు మేజర్ న్యూస్ :**

మార్వాడి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో గుంటూరు నందు ఎడ్యుకేటర్స్ విద్యా సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ రాజేంద్ర సిన్హా జడేజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సదస్సుకు గుంటూరు నగరంలోని పలు విద్యాసంస్థల డైరెక్టర్లు కళాశాల ప్రిన్సిపాల్ వివిధ సబ్జెక్టుల అధ్యాపకులు తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గుజరాత్ రాజ్కోటలోని మార్వాడి విశ్వవిద్యాలయంలో అందుబాటులో ఉన్న వివిధ కోర్సులు ఫీజులు విశ్వవిద్యాలయంలో మౌలిక వసతులు వనరులు తదితర అన్ని అంశాలపై విశ్వ విద్యాలయం పూర్తి స్థాయిలో వివరించారు. కార్యక్రమంలో వెంకీ ఎడ్యుకేషనల్ గైడెన్స్ ఫౌండర్ వెంకట్, మార్వాడి విశ్వవిద్యాలయ అసోసియేట్ ప్రొఫెసర్ హార్దిక్ దోషీ, లీలావతి ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ మార్వాడి విశ్వవిద్యాలయ ఆల్ ఇండియా ఛానల్ పార్ట్నర్ మేకల హరికృష్ణ యాదవ్, అడ్మిషన్ యారో ఎడ్యుకేషన్ సర్వీసెస్ ఫౌండర్ డైరెక్టర్ వెంకట్ కేటబోయిన, తదితరులు కార్యక్రమంలో పాల్గొని వివిధ కళాశాలల నుంచి వచ్చిన ప్రముఖులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యా ప్రమాణాలకి నెలవు మార్వాడి విద్యాలయం అని వక్తలు పేర్కొన్నారు.

## యానిమేటర్ల 6 నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలి
### - సంఘం జిల్లా అధ్యక్షురాలు కే పద్మా



**గుంటూరు మేజర్ న్యూస్ :**

యానిమేటర్ల 6 నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని, మూడు సంవత్సరాల కాల పరిమితి రద్దు చేయాలని కోరుతూ యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం సిఐటియు ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆరు నెలలుగా వేతనాలు రాకపోతే కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. మండలాల్లో విఓఏ లను అక్రమంగా తొలగించడం తక్షణమే ఆపివేయాలని కోరారు. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఉన్న మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని కోరారు. రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని కోరారు. మండలాల్లో అధికారులు యానిమేటర్స్ ను నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు యానిమేటర్స్ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన టిడిపి కూటమి నాయకులు ఇప్పుడు కనీసం మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నప్పటికీ యానిమేటర్లకు ఆరు నెలల వేతన పెండింగ్ ఉందంటే యానిమేటర్ల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న ప్రేమ ఏమిటో అర్థం అవుతుందని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా యానిమేటర్లకు వేతనాలు పెంచాలని కోరారు. తక్షణమే రాజకీయ వేధింపులు అక్రమ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. నిరసన దీక్షకు సంఘం జిల్లా అధ్యక్షురాలు కే పద్మా అధ్యక్షత వహించారు. యానిమెటర్ల నిరసన దీక్షలకు సంఘీభావంగా గుంటూరు జిల్లా ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి. లక్ష్మణరావు, గుంటూరు సిఐటియు తూర్పు కమిటీ కార్యదర్శి కే శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి సత్యనారాయణ పాల్గొని తమ మద్దతును తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు దేబోరా, విజయలక్ష్మి, షాజ, మేరీ, జ్యోతి, కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు వేశారు.. వేగం పెంచారు..



**దుగ్గిరాల ,మేజర్ న్యూస్.**

గత ప్రభుత్వ హయాంలో విడుదల చేసిన నిధులతో దుగ్గిరాల గ్రామంలో రోడ్డు వేశారు .దుగ్గిరాల అలీ నగర్ నుండి గ్యాస్ కంపెనీ మీదుగా మోరంపూడి గ్రామం వరకు రోడ్డు వేశారు. గతంలో గ్రామంలోని రోడ్డుపై గుంతలు గుంతలు ఏర్పడి వాహనాలు, ప్రజలు వెళ్లేందుకు పలు ఇక్కట్లకు గురైనారు. ప్రస్తుతం రోడ్డు వేసి మరో సమస్య కొని కొని తెచ్చుకున్నట్లు అయిందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు . రోడ్డును దాటేందుకు . చిన్నారులు, వృద్ధులు, బాలింతలు, . వెళ్లేందుకు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించవలసి న పరిస్థితులు ఏర్పడ్డాయి. అనునిత్యం ఈ రోడ్డుపై టూ, వీలర్స, ఫోర్ వీలర్స్ తో పాటు కార్లు ,లారీలు వస్తుపోతూ ఉంటాయి. దీనికి తోడు మండల. కేంద్రం కావడంతో మండలంలోని పలు ప్రాంతాల నుండి ప్రజలు బ్యాంకులకు కార్యాలయాలకు. కళాశాలలకు ,పాఠశాల లకు వస్తూ వెళ్తూ ఉంటూ రద్దీగా ఉంటుంది. అసలే ఇరుకు రోడ్లు దానికి తోడు ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకునేందుకే అవకాశం లేక , ఒక్కొక్క పర్యాయం రోడ్డుపైనే మొరాయిస్తూ ఉండటంతో పాటు ఆటో వాలాలు ద్విచక్ర వాహనాలు రోడ్డుపై పార్కింగ్ చేసి ట్రాఫిక్కు.కు ఇబ్బందులు కలిగిస్తున్నారు. దీనితోడు మరికొందరు రోడ్డును ఆక్రమించుకొని కట్టడాలను కట్టడంతో రోడ్డు కుదించుకుపోయి ప్రయాణానికి అనుకూలంగా లేక అనేక ప్రయాసలకు గురవుతున్న తరుణంలో ఎట్టకేలకు గత ఏడాది చివర్లో రోడ్డును పూర్తి చేశారు . రోడ్డుపై గుంతల్ని పూడ్చడంతో వాహనాలకు క ళ్లెం లేక వేగనిరోధ.కాలు నిర్మించినందున వాహనాలు. వేగం పెంచదంతో. ప్రమాదాలు. కొనితెచ్చుకున్నట్లు అవుతుందంటున్నారు. రోడ్డు పూర్తి చేయడంతో వాహనాలు వేగాన్ని పెంచడంతో, ప్రజలు చిన్నారులు వృద్ధులు భయభ్రాంతులను వ్యక్తం చేస్తున్నారు. దీ నికి తోడు మూల మలుపులోను వేగాన్ని పెంచడంతో. ప్రజలు భయాందోళనలను వ్యక్తం చేస్తున్నారు . రోడ్డుకి ఇరువైపులా గ్రావెల్ తో పాటు డ్రైనేజీ. కాలువను నిర్మించినందున పాదచారులు ,వృద్ధులు, ద్విచక్ర వాహనాలు, సైకిలిస్ట్.లు రోడ్డుపైకి ఎక్కేందుకు దిగేందుకు పలు ప్రయాసలు పడవలసి వస్తుంది. రోడ్డు పూర్తి చేసి నెల.లు పైబడినప్పటికీ రోడ్డుకి ఇరువైపులా గ్రావెల్ను తోలకపోవడంతో మరో సమస్య రావడం ప్రజలకు ఇబ్బందికరంగానే ఉంటుంది. రోడ్డును వేసి రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ను వేయటం మరవడంతో పాటు వేగ నిరోధకాలు నిర్మించకపోవడంతో వాహనాల వేగం. పెరగడం వలన ప్రజలు భయాందోళనకు గురుగుతున్నారు. తక్షణమే రోడ్డుపై వేగనిరోధకాలు నిర్మించి వేగాన్ని అదుపు చేసేందుకు తగు చర్యలు తీసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందంటున్నారు.

## పాదయాత్ర ప్రారంభించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కటింగ్ చేసిన నాయకులు

**దుగ్గిరాల ,మేజర్ న్యూస్**



మంగళగిరి శాసనసభ్యులు విద్య ,ఐటీ శాఖ లమంత్రి నారా లోకేష్ చేసిన యువగళం. పాదయాత్ర నేటికి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా కేక్ కటింగ్ చేసి వేడుకలు నిర్వహించారు. దుగ్గిరాల ఎంపీపీ షేక్ జబీన్, తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు. కే.సంనేని శ్రీ అనిత , వెనిగళ్ళ శ్రీకృష్ణ ప్రసాద్ పాల్గొని కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు తినిపించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఆశలు ఆశయాలకు అనుగుణంగా పాదయాత్రను ప్రారంభించారన్నారు. రాష్ట్రంలోని 11 ఉమ్మడి జిల్లాల్లో 97 అసెంబ్లీ నియోజక వర్గాలలోని 232 మండలాలు, మున్సిపాలిటీలలోని297 గ్రామాల మీదుగా 256 రోజులలో 3132 కిలోమీటర్ల మేర పాదయాత్ర కొనసాగించి ప్రజల్లో చైతన్యం నింపారన్నారు. పాదయాత్రలో ఎన్ని అవాంతరాలు ఎదురైన మొక్కవోని దీక్షతో పాదయాత్రను దిగ్విజయంగా నిర్వహించారన్నారు. పాద యాత్రకు ప్రజలు నీరాజనం పట్టారని ఎంపీపీ షేక్ జబీన్ ,అనిత, వెనిగళ్ళ శ్రీకృష్ణ ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పంట పొలాలను పరిశీలించిన
## శాస్త్రవేత్తల బృందం



**పెదకాకాని మేజర్ న్యూస్ :**

మండల పరిధిలోని నంబూరు గ్రామంలోని పంట పొలాలను సోమవారం లాం శాస్త్రవేత్తల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్. ప్రతిభ మాట్లాడుతూ కలుపు ముందు వాడేటప్పుడు రైతులు తగు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని, సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి పి.సంధ్యారాణి, విఏఏలు టి. త్రివేణి, ఎన్ అఖిల, యం. హేమంత్, డీలర్ బి.నాగిరెడ్డి, రైతులు జొన్నల. కరుణాకర్ రెడ్డి, జొన్నల శివారెడ్డి, కొండవీటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


18 వసంతాల 'నేటి దినపత్రిక సూర్య' మహాయజ్ఞంలో
'నేటి దినపత్రిక సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో
అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను
అధిగమించింది. ఈ ప్రస్థానంలో
సూర్యాక్షరంతో మమేకమైన 'నేటి దినపత్రిక సూర్య'
కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు.
మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు పేరుపేరునా
కృతజ్ఞతాభివందనాలు.
ఛ... పి. బాలు (చిన కొండయ్య)
బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా.
సెల్ : 9705554777

## తాడేపల్లి టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసిన టీడీపి నాయకులు

**మంగళగిరి, మేజర్ న్యూస్:**
రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ చేసిన యువగళం పాదయాత్ర ద్వారా రాష్ట్ర రాజకీయన్ని మార్చేసిందని టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు అన్నారు. యువగళం పాదయాత్ర ప్రారంభమై నేటికి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం తాడేపల్లి పట్టణ టీడీపీ కార్యాలయంలో టీడీపి నాయ కులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు తినిపించారు. ఈ కార్యక్రమంలో టీడీపి తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు , రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్



తాడిబోయిన భాస్కర్, మాజీ మున్సిపల్ చైర్మన్ కొయ్యగూరు మహాలక్ష్మి, కాట బత్తుని నిర్మల, సాగర్, సైకం సాంబయ్య, కౌన్సిలర్లు ఇట్టా భాస్కర్,కేలి వెంకటేశ్వం రావు, సీనియర్ నాయకులు అద్దంకి మురళి, మండవ గోపాలరావు,ఉయ్యాల శ్రీనివాసరావు,కే.అంజిరెడ్డి,వల్లభాపురం పీటర్ పాల్, ఎస్.కె చాంద్ భాషా, ఎస్కే మస్తానయ్య, సిహెచ్ రాంబాబు, దొంత రెడ్డి మధు, మేక శ్రీధర్ రెడ్డి రెడ్డి,రాజ, ఎండి అంజాద్, కొయ్యగూర మల్లేశ్వం రావు, ఎస్ కే నాగూర్ వలి, దర్శి హరికృష్ణ, తాడిపోయిన గోపి, వెంకటేష్, పజిల్,పోటా బత్తిన శ్రీనివాస్, తమ్మిలాల సూర్యనారాయణ,సలిం,అన్నెం కుసుమ, భాగ్యలక్ష్మి, పి కృష్ణవేణి,రావుల శిరీష రెడ్డీ, విశాల. సామ్రాజ్యం మాళవిక తదితరులు పాల్గొన్నారు.

## లెప్రసీ రహిత సమాజ నిర్మాణంకు కృషిచేయండి

**తెనాలి, మేజర్ న్యూస్**



తెనాలి పట్టణంలో జరుగుతున్న లెప్రసీపై సర్వేను జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం సోమవారం పరిశీలించారు. పట్టణంలోని నాజర్ పేట, ఎన్ వి ఆర్ కాలనీ, పినపాడు, సుల్తానాబాద్ తదితర ప్రాంతాలలో జరుగుతున్న లెప్రసీ సర్వేలను పరిశీలించి పలు సూచనలు అందించారు. అనుమానాస్పద కేసులను పరిశీలించే విధానాన్ని పరిశీలించారు. సర్వేని సక్రమముగా నూటికి నూరు శాతం నిర్వహించి లెప్రసీ రహిత సమాజం కొరకు కృషి చేయాలని సూచించారు. లెప్రసీ సర్వేలను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని ప్రజలలో అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం దోమల ద్వారా వ్యాపించే వివిధ రకాల వ్యాధులైన మలేరియా. డెంగ్యూ, చికెన్ గునియా, బోదకాలు, మెదడువాపు వ్యాధి, జికా వైరస్ తదితర వ్యాధులపై ప్రజలలో అవగాహన కల్పించారు. నీటి నిల్వలు దోమల ఉత్పత్తికి ఆవాసాలని ప్రజల్ని నీటిని నిలువలు చేసుకొనుట ద్వారా దోమలు సంతతి తగ్గి తద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టవచ్చునని ఇందుకు ప్రజలు అవగాహన అవసరమని తెలిపారు. కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి చిరసానిప్రభాకరరెడ్డి, సబ్ యూనిట్ అధికారులు వంగలపున్నారెడ్డి, అందెబాల చంద్రమౌళి, శ్రీకంఠఉమాకాంత్, శివగణేష్, ఆరోగ్య పర్యవేక్షకులు దీపాల శ్రీనివాస రావు, దాసరి నాగమల్లేశ్వరరావు, బండారు మల్లేశ్వరరావు, వార్డ్ హెల్త్ సెక్రటరీస్ జంషెద్ బేగం, అనిత,కోటేశ్వరి,సుశాంతి, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 3 వంతెనల వద్ద రైల్వే పనులు ఫిబ్రవరి 10 నాటికి పూర్తి చేయాలి

### నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ :**
గుంటూరు నగరంలోని డొంక రోడ్ 3 వంతెనల వద్ద రైల్వే శాఖ చేపట్టిన నూతన ట్రాక్ ఎక్స్ టెన్షన్ పనులు ఫిబ్రవరి 10 నాటికి పూర్తి చేయాల్సిన్దేనని, ఇప్పటికే ట్రాఫిక్ రద్దీతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు రైల్వే అధికారులకు స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ 3 వంతెనల దగ్గర జరుగుతున్న పనులను రైల్వే, జిఎంసి ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు చేపట్టాల్సిన చర్యల పై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గతేదాది నవంబర్ 25 నుండి డొంక రోడ్ వద్ద 3 వంతెనల మార్గంలో రైల్వే శాఖ ట్రాక్ ఎక్స్ టెన్షన్ కోసం రాకపోకలు నిలుపుదల చేశామన్నారు. పనుల వేగవంతానికి రాత్రిపూట కూడా జరగడానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అలాగే సదరు ప్రాంతంలో జిఎంసి త్రాగునీటి పైప్



లైన్ షిఫ్ట్, డ్రైన్ పనులను కూడా చేపట్టుట జరిగిందన్నారు. రైల్వే శాఖ చేపడుతున్న పనులకు జియంసి ఇంజనీరింగ్ అధికారులు కూడా సమన్వయం చేసుకోవాలని, పనులు పూర్తయ్యే వరకు ప్రత్యేకంగా ఒక అధికారిని కేటాయించాలని యస్.ఈ ని ఆదేశించారు. పర్యటనలో రైల్వే డిప్యూటి చీఫ్ ఇంజనీర్ నోయల్, జిఎంసి యస్.ఈ నాగమల్లేశ్వర రావు, ఈఈ సుందర్రామిరెడ్డి, డిఈఈ కళ్యాణరావు పాల్గొన్నారు.

## పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పై ఆకస్మిక తనిఖీ

- రౌడీ షీటర్స్ కదలికలపై పోలీసుల నిఘ పెంచాలి
- గంజాయి, డ్రగ్స్ సేవించినా కఠిన చర్యలు



**గుంటూరు క్రైమ్ మేజర్ న్యూస్:**
నగరంలోని పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పై పశ్చిమ డిఎస్పి కె అరవింద్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎస్పి కే అరవింద్ మాట్లాడుతూ నగరంలో శాంతి భద్రతల విషయంలో రాజీ పడవద్దని, స్టేషన్ వచ్చే బాధితులకు అండగా నిలిచి, కేసు పూర్వ పరాలను క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం చేకూర్చే విధంగా కృషి చేయాలన్నారు. రౌడీ షర్టుల కదిలికల గురించి సీఐ వీరేంద్రబాబును అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా గంజాయి, డ్రగ్స్ సేవించినట్లు మీ దృష్టికి వస్తే అటువంటి వారిపై ఉక్కు పాదం మోపి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్లో రికార్డులు పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులపై మహిళా పోలీసులకు పలు సూచనలు చేశారు.

## భారతీయుల ఐక్యవేదిక ఎస్సై సతీష్




**మాచవరం మేజర్ న్యూస్**
మాచవరం ముస్లిం యూత్ ఆధ్వర్యంలో హ్యూమెన్ చైన్76వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా మండల కేంద్రమైన మాచవరం షాదిఖానా లో భారతీయుల ఐక్యవేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, మాజీ సైనికులు రాగిడి నరేష్,అయ్యారు బ్రహ్మం, చర్చ్ ఫాదర్,సాగర్ మసీద్ ఇమామ్ అబ్దుల్లా, గ్రామ పెద్దలు పుసులూరి రామయ్య, గంధం నాగేశ్వరరావు,సౌరి బాబు, రహీం అబ్బాస్ అలీ, మోదిన్సా సైదా వలి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఆర్డబ్ల్యూఎస్ ఏఈగా సురేష్

**మాచవరం, మేజర్ న్యూస్ :**




అంకితభావంతో విధులు నిర్వహిం చినందుకు గాను మాచవరం మండలం లోని ఆర్డబ్ల్యూసీ ఏఈగా పనిచేస్తున్న సురేష్ కు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు నుంచి పురస్కారం, ప్రశంసా పత్రం అందుకున్నారు. ఆదివారం జరిగిన 76వ రిపబ్లిక్ డే వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ఆయన ఈ అవార్డును స్వీకరించారు. మండల పరిషత్ కార్యాల యంలో సూపర్ డెంట్ గా పనిచేస్తున్న ఎం వి ఎల్ వి ప్రసాద్ రావు కు కూడా అవార్డు రావడం జరిగింది. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది,ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది, పలువురు మండల అధికారులు స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

## దక్షిణ భారత స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ లో గుంటూరు నమూనాకు ప్రత్యేక బహుమతి.



గుంటూరు మేజర్ న్యూస్: ఈనెల 21 నుండి 25 వరకు పుదుచ్చేరి నందుకు జరిగిన దక్షిణ భారత స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నందు గుంటూరు శారదా నికేతనం ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఎస్ ఎస్ ఎన్ ఓ) విద్యార్థుల రూపొందించిన నమూనా "గగన్ యాన్ మిషన్" నకు ప్రత్యేక బహుమతి వచ్చినది. ఈ సందర్భంగా నమూనా రూపొందించిన విద్యార్థులు ఎం.డి. అనీసా బేగం, ఎస్. ఈర్పిత మరియు గైడ్ ఉపాధ్యాయులు ఎం.డి. ఆరిఫ్ బేగ్ లను ప్రధానోపాధ్యాయులు ఎన్. ఉషారాణి, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు. పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని ఉషారాణి మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో ఆసక్తిగా ఈ నమూనాను రూపొందించారని, గైడ్ టీచర్ ఆరిఫ్ బేగ్ సహకారం మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉమాకాంత్ కు ఉత్తమసేవా పురస్కారం

**తెనాలి, మేజర్ న్యూస్**



తెనాలి సహాయ మలేరియా అధికారి కార్యాలయ పరిధిలోని ఉమ్మడి గుంటూరు జిల్లా నుండి పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ బాపట్ల జిల్లా కలెక్టర్ జే వెంకటరమణ చేతుల మీదుగా ఉత్తమ సబ్ యూనిట్ అధికారి అవార్డు ఆదివారం అందుకున్నారు. ఈ మేరకు సోమవారం తెనాలి సహాయ మలేరియా అధికారి కార్యాలయములో అభినందన సభ నిర్వహించారు. ఆయన అందించిన సేవలను కొనియాడారు. అనంతరం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం, సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి, సబ్ యూనిట్ అధికారి అందె బాలచంద్రమౌళి, వంగల పున్నారెడ్డి, శివగణేష్ సీనియర్ హెల్త్ ఇన్స్పెక్టర్ గుద్దంటి రవికుమార్, ఆరోగ్య సిబ్బంది దీపాల శ్రీనివాసరావుబండారు మల్లేశ్వరరావు, తిరువీధుల శివప్రసాద్, దాసరిశివ నాగమల్లేశ్వరరావు,హెల్త్ అసిస్టెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరంలో పశు ఆరోగ్య శిబిరం ఏర్పాటు



**దుర్గి, మేజర్ న్యూస్ :**

దుర్గి మండలంలోని ధర్మవరం గ్రామం నందు పశు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గి వెటర్నరీ డా,, డి. దిలీప్ దూడలు, గేదెలు, ఎద్దలకు సంబంధించిన క్రిమినాశక, వ్యాధి నివారణకు పలు జాగ్రత్తలు సూచించారు. ఈ పశు ఆరోగ్య శిబిరంలో మొత్తం గర్భధారణ పరీక్షలు 17 పశువులకు చికిత్స అందించారని, 55 దూడలకి 173 పశువులకి నట్టల నివారణ మందులు ఉచితంగా పంపిణీ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డా,, డి. దిలీప్, జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి పులి హరి, పులిబండ్ల పిచ్చయ్య మరియు సిబ్బంది వి ఎల్ ఓ శ్రీనివాసరావు , పశు సమర్థక సహాయకులు , గోపాల్ మిత్ర , రైతు పాల్గొన్నారు.

## ముటుకూరు గ్రామలో ప్రారంభించిన మినీ గోశాలను



**దుర్గి, మేజర్ న్యూస్ :**

పల్నాడు జిల్లా, దుర్గి మండలం ముటుకూరు గ్రామం నందు పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ముటుకూరు గ్రామములో మాచర్ల యోహాన్ నిర్మించిన మినీ గోశాలను గ్రామ సర్పంచ్ దొండపాటి చెన్నయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల ఎం పి పి సునీత సాయి శంకర్ మాట్లాడుతూ ఒక్కొక్క గోశాల నిర్మాణానికి వ్యయం 2.3 లక్షలు కాగా జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 90 శాతం రాయితీని నేరుగా రైతు ఖాతాలో జమచేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏచూరి సునీత సాయి శంకర్, ఏ పి ఓ వెంకటేశ్వర్లు మరియు గ్రామ సర్పంచ్ దొండపాటి చెన్నయ్య , జనసేన మండల అధ్యక్షుడు తోటకూర శ్రీనివాసరావు టీడీపీ సీనియర్ నాయకులు లింగా బ్రహ్మయ్య , ఏచూరి సీతారామయ్య పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# రాతే మన భవిత పుస్తకావిష్కరణ



**గుంటూరు మేజర్ న్యూస్ :**

గుంటూరు రూరల్ పొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల గణితశాస్త్ర ఉపాధ్యాయుడు ఉప్పాల రామమోహనరావు రూపొందించిన రాతే మన భవిత పుస్తకాన్ని సమగ్రశిక్ష ఏపీఎస్పీడీ కె. రవీంద్రన్యాథ్‌రెడ్డి, డీఈవో సీవీ రేణుక ఆవిష్కరించారు. సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీంద్రన్యాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు చేతిరాత నైపుణ్యంలో ఉచితంగా శిక్షణ కల్పిస్తూ ఉప్పాల రామమోహనరావు తనతో కలిసి వచ్చిన ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన క్యాలిగ్రఫీ ఫ్యామిలీ సత్ఫలితాలను ఇస్తోందని అన్నారు. ఉపాధ్యాయుల చేతిరాతను అందంగా మలచుకోవడంలో శిక్షణ కల్పించి, వారి ద్వారా విద్యార్థులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమాలతో మొత్తం పాఠశాలల్లో అందరి చేతిరాతలు అందంగా మార్చిన ఘనత క్యాలిగ్రఫీ ఫ్యామిలీకి దక్కుతుందన్నారు. పదాలను పలుకుతూ నేర్చుకోవడం ద్వారా సులభంగా చేతిరాతను మార్చుకోగలరని చెప్పారు. కార్యక్రమంలో ఉర్దూ డిఐ షేక్ ఎండీ ఖాసిం, క్యాలిగ్రఫీ టీం ఇ.అనిల్‌కుమార్, తొరటి శ్రీనివాసరావు, ప్రసాద్, శారద, శైలజ, షాజీర్, బురాన్, నాగలక్ష్మి, నాగమణి, అన్నపూర్ణ, పుష్ప, సత్యనారాయణ, చెన్నకేశవరావు పాల్గొన్నారు.

# ఘనంగా ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ చర్చి నాల్గవ వార్షికోత్సవ వేడుకలు

**దుర్గి , మేజర్ న్యూస్ :**

దుర్గి మండలం, ముటుకూరు గ్రామంలోని ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చి నాల్గవ వార్షికోత్సవం వేడుకలను గ్రామపెద్దలు మరియు సంఘ పెద్దల సహకారంతో ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని



ప్రారంభించారు. ఈ సందర్భంగా చర్చి ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో సంఘకాపరి రివర్ల



కటకాల ఏసుదానం, డెలిగేట్ మాచర్ల దేవ దానం, సం ఘపెద్దలు, యవ్వనస్థులు, స్త్రీల సమాజం పాల్గొన్నారు.

# పారదర్శక పాలన అందించేందుకు వార్డు పర్యటన

**తెనాలి, మేజర్ న్యూస్**

రాజకీయాలకతీతంగా పారదర్శక పాలన అందించేందుకు వార్డు పర్యటన ప్రారంభించినట్లు రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సోమవారం తెనాలి పట్టణంలోని ఐతానగర్‌పరిధిలోని 1, 2 వార్డులలో పేరంటాలమ్మ గుడి వద్ద నుండి ప్రారంభించి ఎస్ బి ఐ బ్యాంక్ తదితర ప్రాంతాల్లో ఆయన పాదయాత్రను నిర్వహించారు. ఎన్. ఎస్. ఎస్ .ఎం మున్సిపల్ హై స్కూల్ సందర్శించి ఉపాధ్యాయులు చిన్నారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. మూడు సంవత్సరాల లోపు అంగన్వాడి స్కూల్లో చదువుతున్న చిన్నారులను ప్రభుత్వ మున్సిపాలిటీ స్కూల్లో చేర్పించే విధంగా ఒక కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.

మహిళల ఆర్థిక సాధికారత పొదుపు సంఘాల మహిళల ఆర్థిక స్థితిని మెరుగుపరచడం కోసం ప్రత్యేక పథకాలు ప్రవేశపెడతామని, వారికి ఆదాయం సృష్టించే అవకాశాలను



ప్రభుత్వం కల్పిస్తుందని తెలియజేశారు. రాబోయే రోజుల్లో ఎవరు ఊహించని విధంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపడతామని మంత్రి మనోహర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్మన్ నన్నపనేని రాజకుమారి, కమిషనర్ బి శేషన్న, తహశీల్దార్ కె వి గోపాల కృష్ణ, మున్సిపల్ ఇంచార్జ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, ప్రజారోగ్య అధికారిణి డాక్టర్ హెలెన్ నిర్మల, పలువురు అధికారులు, కౌన్సిలర్లు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## హర్షం వ్యక్తం చేసిన జిల్లా మాజీ ఎస్సీ సెల్ కార్యదర్శి సాంబయ్య

పెదకాకాని మేజర్ న్యూస్ :- భారతదేశంలో అత్యున్నత పురస్కారాలలో ఒకటైన పద్మశ్రీ అవార్డును ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసినందుకు జిల్లా టిడిపి ఎస్సీ సెల్ మాజీ కార్యదర్శి నంబూరు సాంబయ్య హర్షం వ్యక్తం చేశారు. మాదిగ జాతి ఉద్యమాన్ని మూడు దశాబ్దాల పాటు నిర్విరామంగా కొనసాగిస్తూనే సమాజంలో ఉన్న ఇతర సమస్యలను సైతం తన బుజ స్కందాలపై పోరాటాలు చేస్తున్నారని, చిన్నపిల్లల గుండె జబ్బులపై ఆరోగ్యశ్రీ ఏర్పాటులో వృద్ధులు, దివ్యాంగుల, వితంతువుల పెన్షన్ పెంపు విషయంలోను పోరాటాలు చేశారన్నారు. సమాజంలో అన్ని వర్గాలపై అలుపెరగని పోరాటాలు చేస్తున్న మంద కృష్ణ మాదిగ కృషికి కేంద్ర ప్రభుత్వం గుర్తించి పద్మశ్రీ అవార్డు ప్రకటించడం మాదిగ జాతికే కాక దళిత జాతికే గుర్తింపు వచ్చిందని అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీకి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలిపారు.

## 20 లక్షల ఉద్యోగాలే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యం

### - రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య



మంగళగిరి, మేజర్ న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఏపీ పారిశ్రామిక రంగం తిరిగి జీవం పోసుకుందని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దావోస్ పర్యటనలో భాగంగా ప్రపంచ దిగ్గజాలతో ముఖ్యమంత్రి భేటీ అయి రాష్ట్రానికి భారీ పెట్టుబడులు ఆకర్షించారని అన్నారు. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్, టాటా చైర్మన్ చంద్రశేఖరన్ వంటి ప్రపంచ దిగ్గజాలు సీఎం చంద్రబాబు విజన్‌ను మెచ్చుకోవడం, రాష్ట్రంలో పెట్టుబడి పెడతానని హామీ ఇవ్వడం సీఎం చంద్రబాబు విజన్ 2047 విజయాన్ని సూచిస్తోందన్నారు.

## హార్వెస్ట్ ఇండియా మేనేజర్‌గా సేవ రత్న సుద్దపల్లి నాగరాజు

**గుంటూరు మేజర్ న్యూస్ :**



సేవ రత్న సుద్దపల్లి నాగరాజుని హార్వెస్ట్ ఇండియా మేనేజర్ గా నియమిస్తూ హార్వెస్ట్ ఇండియా అధినేత తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ సోమవారం ప్రకటించారు సోమవారం జరిగిన హార్వెస్ట్ ఇండియా సభ్యుల సమావేశంలో ఈ నిర్ణయం జరిగింది గత ఎన్నో ఏళ్లుగా నాగరాజు కత్తెర సురేష్ కుమార్ తో కలిసి నడుస్తూ పలు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు ఆయన నియామకం పట్ల పలువురు అభినందనలు తెలియజేశారు

## ప్రతి విద్యార్థి ఈగల్ కు బ్రాండ్ అంబాసిడరే

**తాడేపల్లి, మేజర్ న్యూస్:**



మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం అందరి బాధ్యత అని ఏపీ ఈగల్ ఐజి ఆకే రవి కృష్ణ అన్నారు. సోమవారం తాడేపల్లి వడ్డేశ్వరంలోని కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నేరాలు జరిగిన తరువాత కేసులు కట్టడం కంటే నేరాలు జరగకుండా నివారించడమే అత్యంత ముఖ్యమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ను మాదక ద్రవ్యాలు లేకుండా తీర్చి దిద్దేందుకు ప్రతీ విద్యార్థి ఈగల్ కు బ్రాండ్ అంబాసిడరేనని అన్నారు. గుంటూరు జిల్లా ఎస్పి సతీష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులందరూ మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ఫలితాల గురించి అవగాహన పెంచుకుని ఇతరులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈగల్ ఎస్పీ నగేష్, గుంటూరు నార్త్ జోన్ డిఎస్పీ సిహెచ్. మురళీ కృష్ణ, తాడేపల్లి సిఐ కళ్యాణ్ రాజు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్, సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీధర్, ఎన్ సిసి లెఫ్టినెంట్ పావని తదితరులు పాల్గొన్నారు.

# 31న జరిగే బాల మహోత్సవ్‌ను జయప్రదం చేయండి

- విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయులు
- చిన్నారులకు రాష్ట్రస్థాయిలో పోటీలు
- జూనియర్స్, సీనియర్స్ విభాగంలో రెండు రోజుల పాటు మెగా వేడుకలు
- పోటీలకు ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు
- 50కు పైగా ఈవెంట్ల నిర్వహణ



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

విజ్ఞాన్స్ యూనివర్సిటీలో చిన్నారుల కోసం మొట్టమొదటి సారిగా జనవరి 31 నుంచి రెండు రోజుల పాటు నిర్వహించే రాష్ట్రస్థాయి బాల మహోత్సవ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయులు పిలుపునిచ్చారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో రాష్ట్రస్థాయిలో నిర్వహించే చిన్నారుల పండుగ "విజ్ఞాన్ బాల మహోత్సవ్%-%2కే25" పోస్టర్లను ఇప్పటికే విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ఆవిష్కరించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయులు మాట్లాడుతూ 6వ తరగతి నుండి 10వ తరగతి లోపు.. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్ విద్యార్థులు ఈ వేడుకలో పాల్గొనవచ్చని తెలియజేసారు. మరిన్ని వివరాలకు www.vignan.ac.in/balamahotsav వెబ్‌సైట్‌ను సందర్శించి కూడా విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 90305 57363, 9493033592 నంబర్లను సంప్రదించాలని కోరారు. చిన్నారులు తమ ప్రతిభను ప్రదర్శించుకునేందుకు విజ్ఞాన్ బాల మహోత్సవ్ వేదికగా నిలిస్తుందన్నారు. ఇలాంటి వేడుకల్లో విద్యార్థులు పాల్గొనడం వలన నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయన్నారు.

**50కు పైగా ఈవెంట్ల నిర్వహణ**

విజ్ఞాన్స్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా జనవరి 31 నుంచి ఫిబ్రవరి 1 వరకు తొలిసారిగా నిర్వహిస్తున్న బాల మహోత్సవ్‌లో జూనియర్స్ ( 5 నుంచి 7 వ తరగతి), సీనియర్స్ (8 నుంచి 10వ తరగతి ) విద్యార్థులకు మొత్తం 50కు పైగా ఈవెంట్లను నిర్వహించనున్నారు. తొలుత నిర్వహించే స్పోర్ట్స్ ఫీట్‌లో బాలురకు వాలీబాల్, కబడ్డీ, ఖో%-%ఖో, 100 మీటర్లు, 800 మీటర్లు, 4" 100 మీటర్ల రిలే నిర్వహిస్తామన్నారు. చిన్నారి బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖో%-%ఖో, 100 మీటర్లు, 800 మీటర్లు, 4" 100 మీటర్ల రిలే పోటీలు ఉంటాయన్నారు. వీటితో పాటు మ్యూజిక్ ( క్లాసికల్ సింగింగ్ సోలో, సింగింగ్ ఐడల్%-%లిటిల్ చాంప్, గ్రూప్ సింగింగ్, ఇన్స్ట్రుమెంట్ సోలో), డాన్స్ ( క్లాసికల్, వెస్ట్రన్, ఫోక్ గ్రూప్), లిటరరీ ( ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్, జనరల్ క్విజ్, ఎలక్యూషన్), ఫైన్ ఆర్ట్స్ ( స్పాట్ పేయింటింగ్, క్లే మోడల్లింగ్) పోటీలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు, వారి సత్తాను పెంపొందించుకునేందుకు విజ్ఞాన్ బాల మహోత్సవ్ ఓ చక్కని వేదిక అని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులంతా ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

# యువగళం.. చరిత్రాత్మకం

- 3842 కి.మీ లోకేష్ పాదయాత్ర రాష్ట్ర ప్రగతికి నాంది
- పాదయాత్రకు రెండేళ్లు
- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

యువ నాయకులు నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర రాష్ట్రంలో చరిత్రాత్మకమని, పాదయాత్రకు తొలి అడుగు పడి రెండేళ్లు పూర్తయిందని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. తొలుత పాదయాత్ర రెండేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ దేశంలోనే చరిత్ర సృష్టించిన యువగళం పాదయాత్ర 3842 కిలోమీటర్ల మేర సాగిందని, ఇది రాష్ట్ర ప్రగతికి బాటలు పరిచిందని తెలిపారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ పాదయాత్రలో వేదనపడిన అభాగ్యుల కన్నీళ్లను, దగాపడిన నిరుపేదల రోదలను కళ్లారా చూశారని తెలిపారు. ప్రతి ఒక్కరి సమస్యలు ఆలకించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. చెప్పిన విధంగా ప్రతి ఒక్కరి కష్టాలు తీర్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందడుగు వేస్తున్నారని తెలిపారు. ఎన్డీఏ కూటమి అధికారం చేపట్టిన తర్వాత మేధావులు, ఇతర రంగాల వారి సూచనల మేరకు అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారని పేర్కొన్నారు. పాదయాత్ర సమయంలో నాటి జగన్ ప్రభుత్వం పోలీసులను అడ్డు పెట్టుకుని మైకు, స్టూల్ సైతం లాక్కుని అడ్డంకులు సృష్టించిందని గుర్తు చేశారు. అయినప్పటికీ అంకురిత దీక్షతో పాదయాత్ర పూర్తి చేశారని తెలిపారు. నేడు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు నారా లోకేష్ ఒక గుండె ధైర్యమని చెప్పారు. యువగళం పాదయాత్ర నేనున్నాననే భరోసా కల్పించిదని పేర్కొన్నారు. ప్రస్తుతం లోకేష్ పేరు చెబితే మాస్ కు, ప్రజలకు ఒక వైబ్రేషన్ అని కొనియాడారు. చరిత్రాత్మకమైన పాదయాత్ర చేసిన లోకేష్ కు ఈ సందర్భంగా మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్లావుల అశోక్, కార్పొరేటర్ మీరవాలి, జాగర్లమూడి శ్రీనివాసరావు, గుడిపల్లి వాణి, పటాన్ జమీర్, వంగర ఏడుకొండలు, చల్లా ఆంజనేయ ప్రసాద్, ఐలా శ్రీనివాసరావు, కలాం, మజారుద్దీన్, మొవ్వ శైలజ, వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య

అక్షరానికి నైతికతను అద్ది దేశవ్యాప్తంగా 23 ఎడిషన్లతో సామాజిక న్యాయం వైపు మళ్ళించే యజ్ఞం "నేటి దినపత్రిక సూర్య" చేపట్టింది, అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ యజ్ఞంలో "నేటి దినపత్రిక సూర్య" అక్షర సైనికులను మరి కొంత మందిని నియమించుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పల్నాడు, గుంటూరు జిల్లాలలో ఖాళీగా ఉన్న మండలాలకు విలేకరులకు నియమించుకోవదలిచాము. కావలెను. ఆసక్తిగల వారు ఈ క్రింది మండలాలకు ఈ నెల 31వ తేదీలోగా ఇంటర్వ్యూకి ఈ క్రింది అడ్రస్సులో సంప్రదించగలరు.

1.తాడికొండ, 2. తుళ్ళూరు, 3. మేడికొండూరు, 4. ఫిరంగిపురం, 5. ప్రత్తిపాడు, 6. పెదనందిపాడు, 7. కాకుమాను, 8.వట్టిచెరుకూరు, 9.అమరావతి, 10.గుంటూరు రూరల్, 11.గుంటూరు జిల్లాపరిషత్, 12. దాచేపల్లి, 13. బొల్లాపలి, 14. పెదకూరపాడు, 15. పొన్నూరు

**పి. బాలు ( చిన కొండయ్య )**
బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777

జిల్లా ఇన్‌చార్జిలు : జి.శ్రీనివాసరావు సెల్ : 9959426987 ఆర్.డి.నాయక్ సెల్ : 8897455466

ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాంతీయ కార్యాలయం, 9/1, అరండల్‌పేట, గుంటూరు.

## నేటి దినపత్రిక సూర్య కుటుంబ సభ్యులు

www.suryaa.com

"నేటి దినపత్రి సూర్య" ను ఆదరిస్తున్న గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని విశేష పాఠకులు, అధికారులు, రాజకీయ నాయకులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం... ఏదైనా వార్తలు, ప్రకటనలు, యాడ్స్, క్లాసిఫైడ్స్, లీగల్ నోటీసులు ఇలాంటి ప్రకటనలను మా ఈ క్రింది పాత్రికేయులకు తెలియజేయగలరు. సరసమైన ధరలకు యాడ్స్ పబ్లిష్ చేయబడును. మా పత్రికలో పనిచేస్తున్న పాత్రికేయ బృందం.

| | |
|---|---|
| పి. బాలు (చిన కొండయ్య) బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777 | జి.శ్రీనివాసరావు గుంటూరు జిల్లా ఇన్‌చార్జి సెల్ : 9959426987 |
| ఆర్.ధావుర్య నాయక్ (సూర్య ఆర్.డి.) స్టాఫ్ రిపోర్టర్, గుంటూరు జిల్లా. సెల్ : 8897455466 | జి.హిరన్మాయి(కన్నల్) నరసరావుపేట ఆర్‌సి ఇన్‌చార్జి జిల్లా క్రైమ్ రిపోర్టర్ |

| | | | |
|---|---|---|---|
| శేషగిరి రాజు మాచర్ల ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 8341408201 | వై.ఏసుబాబు గురజాల ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 9701250872 | బి.పూర్ణచంద్రరావు సత్తెనపల్లి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9866246951 | చెవుల రంగారావు మెడికల్ రిపోర్టర్, గుంటూరు సెల్ : 9490544635 |
| యం.కృష్ణ మంగళగిరి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9393309149 | వి.రవికుమార్ తెనాలి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 99083 38200 | డి. చైతన్య వినుకొండ ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9381968453 | వి.లూథర్ నరసరావుపేట రిపోర్టర్ సెల్ : 7799382078 |
| జి.ఏలియా ముప్పాళ్ళ రిపోర్టర్ సెల్ : 9392231959 | బి.సాంబశివరావు రాజుపాలెం రిపోర్టర్ సెల్ : 9949382676 | రమేష్ దుగ్గిరాల రిపోర్టర్ సెల్ : 9866782780 | ఎస్.వెంకటేశ్వర్లు పెదకాకాని రిపోర్టర్ సెల్ : 9948175840 |
| కె.నాగరాజు రిపోర్టర్, గుంటూరు సెల్ : 7799881000 | డి.రమేష్ ఈపూరు రిపోర్టర్ సెల్ : 9110734898 | పి.లక్ష్మీనారాయణ నూజెండ్ల రిపోర్టర్ సెల్ : 9666474953 | ఎస్.కె. రవూఫ్ శావల్యాపురం రిపోర్టర్ సెల్ : 7989434737 |
| అక్కిరెడ్డి నరసరావుపేట మెడికల్ రిపోర్టర్ సెల్ : 9849134987 | బి.గురవయ్య వినుకొండ క్రైం రిపోర్టర్ సెల్ : 9908340426 | వి.లక్ష్మీనారాయణ రెంటచింతల రిపోర్టర్ సెల్ : 8500079075 | పి.వెంకటేశ్వర్లు దుర్గి రిపోర్టర్ సెల్ : 8185815858 |
| టి.శ్రీకాంత్ వెల్దుర్తి రిపోర్టర్ సెల్ : 9912818723 | పి.మణికంఠ మాచర్లటౌన్ రిపోర్టర్ సెల్ : 7013169885 | ఎస్.డి.మహబూబ్ మాచర్ల క్రైం రిపోర్టర్ సెల్ : 9989124898 | ఎం.కోటేశ్వరరావు మాచవరం రిపోర్టర్ సెల్ : 6303775169 |
| డి.మల్లికార్జునరావు యడ్లపాడు రిపోర్టర్ సెల్ : 8309237441 | రమేష్ క్రోసూరు రిపోర్టర్ సెల్ : 9493148828 | రాజ్‌కుమార్ పిడుగురాళ్ళటౌన్ రిపోర్టర్ సెల్ : 9160218268 | షేక్ నాగూర్ నకరికల్లు రిపోర్టర్ సెల్ : 98489 26300 |
| పి.ఆనంద్ వినుకొండ రూరల్ రిపోర్టర్ సెల్ : 8125125239 | నాగరాజు మంగళగిరి టౌన్ రిపోర్టర్ సెల్ : 9032258913 | రమేష్ నరసరావుపేట రూరల్ రిపోర్టర్ సెల్ : 7075942600 | "నేటి దినపత్రిక సూర్య" ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యాలయం. 9/1, అరండల్‌పేట, గుంటూరు. |